

శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 7,05,474
బంగారం: 3 గ్రాముల 30 మిల్లీ గ్రాములు
వెండి: 112 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



పుష్ప ప్రదర్శన పొడిగింపు

ఏకామ్ర కానన్‌లో పుష్ప ప్రదర్శన పొడిగించారు. పెద్ద ఎత్తున సందర్శకులు వచ్చారు.
– 8లో



మారుమూలలకు బస్సులు

మారుమూల ప్రాంతాలకు బస్సులు వేశారు. రవాణా శాఖ మంత్రి ప్రారంభించారు.
– 8లో

మార్కెట్‌కు పండగ కళ

పర్లాకిమిడి పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆర్.ఎం.సి.యార్డుకు జనం పోటెత్తారు. మకర సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని శనివారం పెద్ద ఎత్తున వ్యాపారం జరిగింది. కుండలు, కోళ్లు, మేకలు, కాయగూరలు, వెదురు బుట్టలు, రెడీమేడ్ దుస్తులను పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. వనరాజా కోళ్ల జత రూ.600 పలకగా.. పుంజులు జత రూ.700 నుంచి రూ.800 ధర పలికాయి. పది కిలోల మేక ధర రూ.15వేలకు పైమాటే. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో లక్షలాది రూపాయల వ్యాపారం జరిగింది.

– పర్లాకిమిడి



పర్లాకిమిడి సంతలో కొత్త కుండలు



ఫ్యాన్సీ వస్తువులు



సంతలో చాటలు, బుట్టలు



వనరాజా కోళ్ల అమ్మకం



సంతలో మేకపోతులు



ఆవుమందలకు ఉపయోగించే తాళ్లు

న్యూస్‌రీల్

పులిహోరతో శ్రీనివాసుడి రూపం



పులిహోరతో రూపొందించిన శ్రీనివాసుని రూపం

రాయగడ: జేకేపూర్‌లో గల కల్యాణ వేంకటేశ్వర ఆలయం ప్రాంగణంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న విశేష పూజల్లో భాగంగా శనివారం సుమారు 12 అడుగుల స్వామిని పులిహోరతో రూపొందించారు. 16 రకాల సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన పాయసం 108 చిన్న గంగాళాలతో స్వామికి నివేదించారు. ఆలయ ప్రధాన అర్చకులు పొందూరు వెంకట ప్రదీప్ ఆచార్యులు, వంశీ మనోహర్ ఆచార్యులు విశేష క్రతువులను నిర్వహించారు.

కొరాపుట్ గజగజ..

- 4.9 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత



దమంజోడి వద్ద శనివారం 4.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన దృశ్యం

కొరాపుట్: కొరాపుట్ జిల్లాను చలి వణికిస్తోంది. శనివారం కొరాపుట్ జిల్లా దమంజోడి వద్ద భారత అల్యూమినియ కేంద్రం (నాల్కో) టౌన్ షిప్ వద్ద 4.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చలితో పాటు శీతల గాలులు వీస్తుండడంతో ప్రజలు వణికి పోతున్నారు. మరో వైపు శనివారం నుంచి వరుసగా ప్రభుత్వ సెలవులు ప్రారంభం కావడంతో మార్కెట్లు డీలా పడ్డాయి. జన సంచారం లేక రోడ్లు కళ తప్పాయి. ఉదయం ఎనిమిది గంటల వరకూ చలి తీవ్రత ఉండడంతో ప్రజలు రోడ్డుపైకి రావడం లేదు.

సైబర్ నేరంలో ఇద్దరు అరెస్టు



అరెస్టయిన నిందితులతో పోలీసులు

కొరాపుట్: సైబర్ నేరానికి పాల్పడిన ఇద్దరు నిందితులను నబరంగ్‌పూర్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ పోలీస్ స్టేషన్ అధికారులు శనివారం వెల్లడించారు. రాయిఘర్ సమితి జొడిగాం ఫార్మాసిస్ట్ మనోజ్ కుమార్ మండల్‌కు గత ఏడాది ఏప్రిల్ 24న ఫోన్ కాల్ వచ్చింది. అతని మేనకోడలు, మేనల్లుడు భువనేశ్వర్‌లోని ఓ రెస్టారెంట్‌కి వెళ్లారని, అక్కడ మేనల్లుడు ఓ మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఇద్దరినీ పోలీసులు అదుపులో ఉన్నారని, తక్షణం లక్ష రూపాయలు పంపించాలని డిమాండ్ చేశారు. భయపడిన మనోజ్ వెంటనే వారిచ్చిన రెండు బ్యాంకు ఖాతాలకు రూ. 50 వేలు చొప్పున పంపించాడు. తర్వాత ఆరా తీయగా తన వారు క్షేమంగా ఉన్నారని, ఇదంతా కుట్రగా తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను పంపిన అకౌంట్లలలో ఒకటి ఒడిశాది కావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు అసిస్ అర్కన్, అకాస్ మండల్, మరో మైనర్‌ను గుర్తించారు. వీరిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

రబీకి నీరు విడుదల



కొలాబ్ కెనాల్‌లో విడిచిన సాగునీరు

జయపురం: అప్పర్ కొలాబ్ ప్రాజెక్టులు మరమ్మత్తులు పూర్తయిన ప్రాంతాలలో రబీ పంటలకు శనివారం సాగునీరు అందించేందుకు కొలాబ్ ప్రధాన కెనాల్‌లో నీరు విడిచారు. కొలాబ్ ప్రాజెక్టులో అంతర్‌భాగమైన సతిగుడ డ్యామ్ నుంచి ప్రతి సెకన్‌కు 15 ఘనపు మీటర్ల నీరు కెనాల్‌కు విడిచిపెడుతున్నారు. రానున్న రెండు మూడు దినాల్లో కెనాల్‌కు రెండింతల నీరు అదనంగా విడిచి పెట్టవచ్చని సాగునీటి ప్రాజెక్టు అధికార వర్గాలు వెల్లడించాయి. అలాగే బుధవారం రత్నపూర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సాగునీరు విడిచినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. ఈ రబీలో జయపురం సబ్‌డివిజన్‌లో కుంద్ర, కొట్‌పాడ్, జయపురం, బొరిగుమ్మ సమితుల్లో 25 వేల 127 హెక్టార్ల భూమికి సాగునీరు అందించాలన్న లక్ష్యం పెట్టుకున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 1573 హెక్టార్లకు తక్కువ భూమికి సాగు నీరు అందించనున్నట్లు వెల్లడించారు. పాణి పంచాయతీలో గత సమావేశంలో జనవరి 2 నుంచి సాగు నీరు విడవాలని నిర్ణయించారు. అయితే జయపురం, బొరిగుమ్మ సమితుల్లో మరమ్మతులు జరుగుతున్నాయి. దీంతో మరమ్మతులు పూర్తయ్యాకే నీరు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. కెనాల్ మరమ్మతులు పూర్తయినంత వరకు నీరు సతిగుడ డేమ్‌లో నిల్వ ఉంటుందని వెల్లడించారు. జయపురం ప్రధాన కెనాల్, పద్మపూర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ల ద్వారా మొదట విడతగా నీరు విడిచిపెట్టనున్నట్లు వెల్లడించారు. తరువాత క్రమంగా మిగతా భూములకు నీరు అందిస్తామన్నారు.

అనుమానం పెనుభూతమై..

- భార్యను హత్య చేసిన భర్త
- పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు

మల్కన్‌గిరి: భార్యను భర్తను దారుణంగా హతమార్చాడు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎం.వి.66 గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. నితీస్ విశ్వస్ తన భార్యను కత్తితో గొంతుకోసి హత్య చేసి కలిమెల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఐఐసీ చంద్రకాంత్ తండి ఎదుట లొంగిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నితీస్ కలిమెల సమితి కేంద్రంలో ఓ జ్యూస్ దుకాణాన్ని నడుపుతూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొద్దిరోజులుగా భార్యపై అనుమానంతో తరుచూ గొడవ పడుతున్నారు. ఇద్దరి మధ్య విభేదాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి నితీస్ విశ్వస్ మద్యం తాగి భార్యతో గొడవ చేస్తున్నాడు. రాత్రి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడి పక్కనే ఉన్న కత్తితో ఆమె మెడపై నరికి చంపేశాడు. ఆ తరువాత కలిమెల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుతున్న పోలీసులు నితీస్ విశ్వస్ భార్య మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శనివారం మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఐఐసీ చంద్రకాంత్ తండి తెలిపారు.



కలిమెల ఆరోగ్య కేంద్రం వద్ద నితీస్ విశ్వస్ భార్య మృతదేహం

పండగలు.. సంప్రదాయానికి ప్రతీకలు



ప్రసంగిస్తున్న రచయిత నాగరాజు



మహిళలకు పండ్లు, తాంబూలాలను అందిస్తున్న శేషసాయి



గాలిపటాల పోటీ



చెరకు గడలతో పూజలు

రాయగడ: సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలుగా పండుగలు నిలుస్తాయని ప్రముఖ రచయిత, సీనియర్ పాత్రికేయుడు భళ్లమూడి నాగరాజు అన్నారు. స్థానిక బాకురుగుడ సెయింట్ జావియర్స్ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ బిశ్వజిత్ శిక్కా అధ్యక్షతన శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు సంప్రదాయాలను పరిరక్షించి వాటిని గౌరవించాలన్నారు. రచయిత్రి కొళ్లూరి శేషసాయి మాట్లాడుతూ సంస్కృతి ఆవిర్భావం, సూర్యుడి కదలిక, పెద్ద పండుగ ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఏ స్థాయికి చేరినా తెలుగు సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు మరిచిపోకూడదన్నారు. పాఠశాలల్లో విద్యార్థి దశ నుంచే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించి తెలుగుదనం విశిష్టతను తెలియజేయాలన్నారు. అనంతరం చిన్నారులకు సామూహికంగా భోగి పండ్లు పోశారు. విద్యార్థులు భోగి మంటల చుట్టూ తిరిగి ఆనందించారు. విద్యార్థులు రంగవల్లులు, గాలిపటాల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు అభిలాష్ పట్నాయక్, లక్ష్మీపట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు భోగి పండ్లు పోసిన దృశ్యం



చిన్నారుల నృత్య ప్రదర్శనలు



భోగి

40 వేల గంజాయి మొక్కలు ధ్వంసం



గంజాయి క్షేత్రాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు, అబ్కారీ శాఖ సిబ్బంది



పోలీసులకు దొరికిన గంజాయి

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్ పిండికి గ్రామ పంచాయతీ నిజుమా ఏజెన్సీ గ్రామంలో 20 ఎకరాల్లో పండిస్తున్న గంజాయి క్షేత్రాన్ని పోలీసులు, ఎక్సైజ్ బృందం సంయుక్తంగా దాడిచేసి ధ్వంసం చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా ఆదేశాల మేరకు ఆపరేషన్ గ్రీన్ క్లీన్ పిలుపు మేరకు మోహనా పోలీసులు, ఎక్సైజ్, రెవెన్యూ బృందం ఉమ్మడిగా పిండికి పంచాయతీ, నిజుమా ఏజెన్సీలో శనివారం తెల్లవారు జామున జరిపిన దాడుల్లో 20 ఎకరాల్లో అక్రమంగా పండిస్తున్న గంజాయిని కనుగొన్నారు. దీని విలువ మార్కెట్‌లో సుమారు రూ.4 కోట్లు ఉంటుందని మోహనా ఐఐసీ బసంత్‌కుమార్ శెఠి తెలిపారు. మొత్తం 40 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేసి రెవెన్యూ అధికారుల సమక్షంలో తగులబెట్టారు. ఈ ఆపరేషన్‌లో రెండు ప్లాటూన్ల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. గంజాయి ఆపరేషన్ క్లీన్ గజపతి జిల్లాలో తరచూ దాడులు చేస్తామని మోహనా ఐఐసీ బసంత్ కుమార్ శెఠి తెలిపారు.

39 కిలోల గంజాయి స్వాధీనం

జయపురం: జయపురం సదర్ పోలీసులు 39 కిలోల గంజాయిని జప్తు చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి శనివారం వెల్లడించారు. కారులో పట్టుబడిన గంజాయి విలువ రూ.3 లక్షల 90 వేలు ఉంటుందని ఆయన వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ కుమార్ పాణి పోలీసులతో కలసి పెట్రోలింగ్ చేస్తుండగా.. ఒక కారు జయపురం వైపు నుంచి బొరిగుమ్మ వైపు వెళ్లడం గమనించి ఆపారు. దీంతో అందులో ఉన్న వారు కారు విడిచి పారిపోయారు. కారుని శోధించగా అందులో గంజాయి దొరికింది. మెజిస్ట్రేట్ సమక్షంలో పట్టుబడిన గంజాయి తూయించగా 39 కేజీలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసు అధికారి తండి వెల్లడించారు. గగనాపూర్ పోలీసు పంటి అధికారి సబ్‌ఇన్‌స్పెక్టర్ రాజ కిశోర్ బారిక్ కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు.

బీఎంసీ కార్మికుని మృతికి పరిహారం చెల్లింపు



బీఎంసీ కార్యాలయం ఎదురుగా దివంగత కార్మిక నేత మృతి పట్ల తోటి కార్మికుల నిరసన ప్రదర్శన

భువనేశ్వర్: స్థానిక రసూల్‌గఢ్ రైల్వే వంతెనపై బుధవారం పట్ట పగలు దారుణ హత్యకు గురై దుర్మరణం పాలైన బీఎంసీ సఫాయి కర్మచారి సంఘం అధ్యక్షుడు సహదేవ్ నాయక్ కుటుంబీకులకు పరిహారం ప్రకటించారు. అతని భార్యకు కారుణ్య కోటా కింద ఉద్యోగం కల్పించాలని భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మృతుని కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారంతో భార్యకు ఉద్యోగం ప్రకటించింది. హత్యకు గురైన సఫాయి కార్మిక సంఘం అధ్యక్షుడు సహదేవ్ నాయక్ హత్య సంఘటనపై సీబీఐ విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలనే నినాదంతో తోటి కార్మిక వర్గం బీఎంసీ కార్యాలయం ఎదురుగా నిరసన ప్రదర్శించింది. ఈ సందర్భంగా మృతుని కుటుంబానికి రూ. 30 లక్షల నష్టపరిహారం, కుటుంబీకుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆందోళన కొనసాగించారు. నగర మేయర్ సులోచన దాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సలహా కమిటీ చైర్మన్ బిరంచి నారాయణ్ మహాసూపకర్ పాల్గొని కార్మికుల డిమాండ్లపై నిర్ణయం తీసుకున్నారు. వీరి నిర్ణయం మేరకు మృతుడి భార్యకు సూపర్‌వైజర్ ఉద్యోగం, కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారం అందజేయనున్నారు. ఈ నిర్ణయంతో రెండు రోజులుగా కొనసాగుతున్న కార్మికుల నిరసనకు తెరపడింది. మృత సహదేవ్ నాయక్ పని చేసిన ప్రాంతంలోనే అతని భార్యకు ఉద్యోగ నియామకం జరుగుతుందని మేయర్ హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

ఉత్తరాది వైభవ వెంకటేశుని సన్నిధిలో భోగీ సన్నాహాలు



భువనేశ్వర్: జాజ్‌పూర్ ఉత్తరాది మఠం ప్రాంగణం వైభవ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో భోగి పండగ వేడుకల నిర్వహణకు భారీ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా భోగీ మంట, పసి పిల్లలకు భోగీ పండ్లు వంటి సంప్రదాయ వేడుకలతో గోదా దేవి కల్యాణోత్సవం ఆధ్యాత్మిక, బాలబాలికలతో డూ డూ బసవన్న నాటిక వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక వర్గం తెలిపింది.

చలి..పులి



ఆర్.ఉదయగిరిలో మంట కాగుతున్న ప్రజలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి, మోహానాలో చలి తీవ్రత రెండురోజులుగా పెరిగింది. వేకువజామున పోగమంచు కమ్ముకుంది. ఆర్.ఉదయగిరి, చంద్రగిరి, మోహానాలో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ఏజెన్సీ ప్రాంతంలో చాలాచోట్ల చలిమంటలు కాచుకుంటున్నారు. గంజాం, గజపతి, రాయగడ, కళాహాండి, కంధమాల్, సుందర్‌ఘడ్, జర్సుగుడ, అనుగుల్ మరియు ఢెంకానాల్‌లో ఐ.ఎం.డీ ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. వచ్చే మూడు రోజుల్లో చలి మరో రెండు నుంచి నాలుగు డిగ్రీలు, కోస్తా తీర ప్రాంతంలోనూ ఉష్ణోగ్రతలు తగ్గనున్నట్లు ఐఎండీ మాజీ డైరెక్టర్ శరత్ చంద్ర సాహు తెలిపారు.

యువతి అనుమానాస్పద మృతి



లక్ష్మీ తియాక (ఫైల్)

రాయగడ: పదిహేనేళ్ల యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. డుమురిపాదొరా గ్రామానికి చెందిన లచియా తియాక కుమార్తె లక్ష్మీ తియాక సులిపాదొరా ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. సెలవులు కావడంతో ఇంటికి వచ్చిన ఆమె తమ పొలంలో వేసిన పత్తి పంటను కోసేందుకు వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో లచియా పొలానికి వెళ్లగా తన కుమార్తె చెట్టు వాణీతో ఉరివేసుకుని వేళాడుతుండటం గమనించి బోరున విలపించాడు. వెంటనే గ్రామస్తులకు తెలియజేశాడు. అనంతరం అక్కడికి చేరుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. బాలిక మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీదేవికి నోట్ల కళ



కరెన్సీతో కళకళలాడుతున్న లక్ష్మీదేవి

సారవకోట: మండలంలోని చీడిపూడి వేంకటేశ్వర స్వామి ఆలయంలోని లక్ష్మీదేవిని శనివారం లక్షల రూపాయల కరెన్సీ నోట్లతో అలంకరించారు. అలంకరణకు రూ.10, 20, 50, 100, 200 రూపాయల నోట్లను వినియోగించినట్టు అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు. ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని కరెన్సీతో అలంకరించమన్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో మొక్కులు తీర్చుకునేందుకు పలువురు చిన్నారులకు కలాకండలతో తులాభారం నిర్వహించారు.

పుష్ప ప్రదర్శన పొడిగింపు

స్థానిక ఏకామ్ర కాననలో వార్షిక పుష్ప ప్రదర్శనను రాష్ట్ర ప్రభుత్వం ఒక రోజు పొడిగించింది. ఈ నెల 7న ప్రారంభమైన ఈ ప్రదర్శన వాస్తవానికి శనివారంతోనే ముగియాల్సి ఉన్నా.. సందర్శకుల నుంచి విశేష స్పందన లభించడంతో ఆదివారం కూడా కొనసాగిస్తున్నట్లు అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల విభాగం మంత్రి గణేష్ రామ్ సింగ్‌కుంటియా ప్రకటించారు. స్థానిక ప్రాంతీయ మొక్కల వనరుల కేంద్రం (ఆర్పీఆర్సీ) ప్రాంగణంలో ప్లాంట్ లవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ ప్రదర్శనలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆకర్షణీయ, సుగంధ, అలంకారభరిత పూల మొక్కలతో కూడిన 70 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. గులాబీలు, బంతి పువ్వులు, డష్లియాలు, జిన్నియాలు, ఫెర్న్‌లతో సహా 500 రకాల పుష్పాలు సందర్శకుల్ని ఆకట్టుకుంటున్నాయి.

– భువనేశ్వర్









ఏకామ్ర కాననలో సుగంధ భరిత పుష్ప ప్రదర్శన

మృతుడి కుటుంబానికి నవీన్ సాయం



బాధితుల్ని పరామర్శించిన విపక్ష నేత నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రసూల్‌గఢ్ రైల్వే వంతెనపై దారుణ హత్యకు గురై మరణించిన సహదేవ్ కుటుంబీకులతో విపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్‌ను కలిశారు. ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతి ప్రకటించి కుటుంబానికి సాయం అందజేశారు. ఇద్దరు పిల్లల చదువుసంధ్యల బాధ్యతల్ని స్వీకరించినట్లు ప్రకటించారు. మృతుడి కర్మకాండ కార్యకలాపాల కోసం ఆర్థిక సాయం కింద రూ. 50 వేలు అందజేశారు.

రాయగడ డీఆర్ఎం బాధ్యతల స్వీకరణ



అమితాబ్ సింఘాల్

భువనేశ్వర్: భారతీయ రైల్వేలో నిష్ణాతుడైన అధికారి అమితాబ్ సింఘాల్ తూర్పు కోస్తా రైల్వే పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన రాయగడ మండల రైల్వే అధికారి (డీఆర్ఎమ్)గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాయగడ డివిజన్‌కు మొదటి డివిజనల్ రైల్వే మేనేజర్ కావడం విశేషం. ఆయన ఆధ్వర్యంలో కొత్త డివిజన్ అమలుతో మౌలిక సదుపాయాల అభివృద్ధి కొనసాగాల్సి ఉంది. అమితాబ్ సింఘాల్ భారతీయ రైల్వేలో అద్భుతమైన ట్రాక్ రికార్డ్‌తో ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఐఐటీ ట్రిచీ నుంచి ఎలక్ట్రికల్ – ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేట్‌గా ఉత్తీర్ణత సాధించి 1999లో అసిస్టెంట్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా భారతీయ రైల్వే సేవా రంగంలో అడుగు పెట్టారు. అత్యాధునిక వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు రూపకల్పన, తయారీ, పరుగులు తీయించడంలో ప్రత్యేక పాత్రధారిగా పేరు తెచ్చుకున్నారు. రైల్వే విద్యుదీకరణ రంగంలో పలు ఆవిష్కరణలతో సహా కీలకమైన ప్రాజెక్టుల కార్యాచరణలో తన దక్షత చాటుకున్నారు.

రాయగడ డీఆర్ఎం పర్యటన



పట్టణ ప్రముఖులతో భేటీ అయిన డీఆర్ఎం సింఘాల్

రాయగడ: రాయగడ రైల్వే డివిజన్ డీఆర్ఎంగా బాధ్యతలు చేపట్టిన అమితాబ్ సింఘాల్ మొదటి సారిగా రాయగడలో పర్యటించారు. శనివారం నాడు ఇక్కడకు వచ్చిన ఆయనకు రైల్వే అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మజ్జిగౌరి అమ్మవారిని సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పారిశ్రామిక ప్రాంతమైన రాయగడ రైల్వే డివిజన్‌గా గుర్తింపు పొందడం, ఈ డివిజన్‌కు డీఆర్ఎంగా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. రాయగడలో డివిజన్‌కు సంబంధించి జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను సమీక్షించి అవి త్వరిత గతిన పూర్తయ్యేలా కృషి చేస్తానని అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఆర్ఎం సింఘాల్

మారుమూల ప్రాంతాలకు బస్సు సేవలు ప్రారంభం



వర్చువల్‌గా బస్సుల ప్రారంభోత్సవం



నీలం జెండా ఊపి కొత్త బస్సు సేవల్ని ప్రారంభించిన మంత్రులు

భువనేశ్వర్: రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలకు రవాణా వ్యవస్థను సులభతరం చేసేందుకు కొత్త బస్సు సేవల్ని రాష్ట్ర వాణిజ్య, రవాణా శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా నీలం జెండా ఊపి ప్రారంభించారు. వికసిత్ ఒడిశా సాకారం దిశలో మారుమూల ప్రాంతాల్ని జిల్లా ప్రధాన కేంద్రాలు, వర్తక వ్యాపార ప్రముఖ కేంద్రాలతో అనుసంధానపరుస్తూ కొత్తగా ఒడిశా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 15 బస్సు సేవల్ని ప్రవేశ పెట్టింది. సిద్ధ భైరవి, గొణయా, కోట్పాడ్, జొ నుంచి పూరీకి, వైయా నుండి పూరీకి, కోట్‌పాడ్, జొరొండా, పర్లాకిమిడి, ఇంద్రావతి ప్రాంతాల నుండి పూరీకి, బరంపురం నుండి భువనేశ్వర్ మరియు రౌర్కెలా, కుందూరు నుంచి కటక్ ప్రాంతాలకు వర్చువల్ మాధ్యమంలో మంత్రి కొత్త ఓఎస్ఆర్‌టీసీ బస్సు సేవల్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నిత్యానంద గోండ్, ఆహార, పౌర సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో, నవరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మాఝీ, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మాఝీ, కోట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భాత్రా, ఖండపడా ఎమ్మెల్యే దుష్మంత్ స్వంయి పాల్గొన్నారు.

హోరా.. హోరీగా..



పరుగు పందెం పోటీల్లో విద్యార్థినులు



బహుమతి ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ జితేంద్ర పట్నాయక్



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ జితేంద్ర పట్నాయక్

పర్లాకిమిడి: స్థానిక మహిళా ప్లస్ త్రీ స్నాతక కళాశాల వార్షిక క్రీడా పోటీలు శనివారం మధ్యాహ్నం శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాల ప్రిన్సిపాల్ డా.జితేంద్ర నాథ్ పట్నాయక్ ప్రారంభించారు. విద్యార్థులు వంద, రెండు వందల మీటర్ల పరుగు పందాలు, లాంగ్ జంప్, జువెలిన్ త్రో, తదితర ఈవెంట్లు పాల్గొన్నారు. విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. రీనా సాహు, స్పోర్ట్ అధికారి భారతీ పాణిగ్రాహి, పీఈటీలు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



పరుగు పోటీలో చిన్నారులు



ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న అతిథులు

జయపురం: స్థానిక డీఏవీ మోడల్ సీనియర్ సెకెండ్రి స్కూల్ క్రీడా ఉత్సవాలు శుక్ర, శనివారం జరిగాయి. బీజేడీ సీనియర్ నాయకుడు, కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ రమాకాంత రౌళో పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. చదువుతోపాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పలు క్రీడా పోటీల్లో నర్సరీ నుంచి 10వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతుల అందజేశారు. ఏఓ ఆర్.ఎస్.పాణిగ్రహి, ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖాదర్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి పాత్రో, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



రన్నింగ్ పోటీలో బాలురు

న్యాయ అభిలేఖనాలయం ప్రారంభం



న్యాయ అభిలేఖనాలయం ఆవరణలో న్యాయ నిపుణులతో ముఖ్యమంత్రి



న్యాయ అభిలేఖనాలయం ప్రారంభించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



అభిలేఖనాలయంలో పాత న్యాయ ప్రతుల్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

భువనేశ్వర్:

కటక్ నగరంలో రాష్ట్ర హై కోర్టు న్యాయ అభిలేఖనాలయం ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రారంభించారు. కటక్ జ్యుడీషియల్ అకాడమీ ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ భారతీయ న్యాయ వ్యవస్థ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదని, ప్రజాస్వామ్య విలువలతో నిష్పక్షపాత న్యాయ నిర్వహణలో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. 150 ఏళ్ల నాటి బ్రిటీష్ చట్టం నుంచి బయటపడి న్యాయ వ్యవస్థను మరింత సరళీకరించేందుకు ఇండియన్ జ్యుడీషియరీ కోడ్, సివిల్ ప్రొటెక్షన్ కోడ్, ఎవిడెన్స్ యాక్ట్ అమలులోకి వచ్చాయని వివరించారు. దీని ద్వారా ప్రజలకు సముచిత న్యాయం నిష్పక్షపాతంగా అందుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. కటక్ జ్యుడీషియల్ అకాడమీ ఆధ్వర్యంలో రూ. 39 కోట్ల వ్యయంతో నిర్మితమైన న్యాయ అభిలేఖనాలయం న్యాయ వ్యవస్థలోని గొప్ప వారసత్వ సంపదకు భాండాగారంగా సేవల్ని అందిస్తుందన్నారు. ఈ కేంద్రం దేశమంతటా న్యాయ విద్యకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

భారీగా గంజాయి ధ్వంసం



జయపురం: గంజాయి మొక్కలను తగులబెడుతున్న పోలీసులు



పర్లాకిమిడి: ఖరిగుమ్మ వద్ద గంజాయి పంటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

జయపురం: సబ్ డివిజన్‌లోని బొయిపరిగుడ సమితి జి.మఝిగుడ పంచాయతీ టిక్రపడ ప్రాంతంలో పోలీసులు ఆపరేషన్ గ్రీన్ క్లీన్ అభిజాన్ నిర్వహించారు. 21 ఎకరాలలో సాగు చేస్తున్న గంజాయి పంటను ధ్వంసం చేసినట్లు బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజళీ ప్రధాన్ శనివారం తెలిపారు. పంట విలువ రూ.2కోట్లు ఉంటుందని వివరించారు. దాడుల్లో తనతో పాటు సబ్ ఇన్‌స్పెక్టర్ ధీరెన్ బారిక్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ శివశంకర నాయిక్, గజానన నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

ఖరిగుమ్మ వద్ద 17 ఎకరాలు..

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా పోలీసులు శనివారం ఖరిగుమ్మ, బోడోసింధ్ పంచాయతీల పరిధిలో 17 ఎకరాల గంజాయి సాగును ధ్వంసం చేశారు. సుమారు 34వేల గంజాయి మొక్కలు నాశనం చేసినట్లు మోహనా ఇన్‌చార్జి పోలీసు అధికారి (ఐఐసీ) బసంత్ కుమార్ శెఠి తెలిపారు.

108 సేవల్లో జాప్యం..!

- తగినన్ని అంబులెన్సుల్లేకే..
- విజయనగరం నియోజకవర్గం మొత్తానికి ఒకే అంబులెన్సు
- కేసును విశాఖ తరలిస్తే పక్క మండలాల నుంచి రావాల్సిందే..
- జిల్లాలో ఉన్న అంబులెన్సులు 28
- వీటిలో ఒక నియోనేటల్ అంబులెన్సు

విజయనగరంలోని ఉడా కాలనీకి చెందిన పద్మావతి అనే మహిళకు జ్వరంతో పాటు కాళ్లు, చేతులు లేపలేని స్థితిలో ఉండడంతో ఆస్పత్రికి వెళ్లడానికి 108 అంబులెన్సుకు ఫోన్ చేసారు. విజయనగరంలో ఉన్న 108 అంబులెన్సు కేజీహెచ్‌కు వేరే కేసును తీసుకువెళ్లింది. దీంతో గంట్యాడలో ఉన్న 108 అంబులెన్సు ఉడా కాలనీకి వచ్చి పద్మావతిని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు.

శ్రీకాకుళం నుంచి రైల్లో శనివారం ఎం.జయసుధ అనే మహిళ విజయవాడ వెళ్లేందుకు వస్తుండగా రైల్లో పడిపోయి కోమాలోకి వెళ్లిపోయింది. దీంతో రైల్వే పోలీసులు 108 అంబులెన్సుకు ఫోన్ చేసారు. విజయనగరంలో ఉన్న 108 అంబులెన్సు కేజీహెచ్‌కు వేరే కేసును తీసుకువెళ్లడంతో గంట్యాడ 108 అంబులెన్సు సిబ్బంది రైల్వేస్టేషన్‌కు వచ్చి ఆ మహిళను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు.

గంట్యాడ మండలానికి చెందిన డి.సూరినాయుడు అనే వ్యక్తి కొద్ది రోజులుగా ఆయాసం, దగ్గుతో బాధ పడడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్సుకు ఫోన్ చేసారు. ఆ సమయంలో గంట్యాడకు చెందిన 108 అంబులెన్సు వేరే కేసును తీసుకు వెళ్లడంతో డెంకాడకు చెందిన 108 అంబులెన్సు వచ్చి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించింది.

విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పాండ్రంకి గ్రామానికి చెందిన గురునాయుడు కిడ్నీ సమస్యతో విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరారు. అతనికి మెరుగైన వైద్యం కోసం సర్వజన ఆస్పత్రి వైద్యులు కెజీహెచ్‌కు రిఫర్ చేసారు. ఆ సమయంలో విజయనగరంలో ఉన్న 108 అంబులెన్సు విశాఖపట్నం కెజీహెచ్‌కు రోగిని తీసుకుని వెళ్లింది. దీంతో గంట్యాడ 108 అంబులెన్సు గురునాయుడును కేజీహెచ్‌కు తరలించింది.

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో సరిపడ 108 అంబులెన్సులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సంఘటన స్థలానికి 108 అంబులెన్సు వచ్చేందుకు ఎక్కువ సమయం పడుతుండడంతో రోగుల బంధువుల్లో టెన్షన్ నెలకొంటుంది. సంఘటన స్థలానికి 15, 20 నిమిషాల్లో రావాల్సి ఉండగా 40 నుంచి 50 నిమిషాల సమయం పడుతుంది. అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు రోగుల బంధువులు ఆందోళన చెందుతున్నారు. ఆపదలో ఉన్న వారిని ఎంత త్వరగా ఆస్పత్రికి చేర్చగలిగితే అంత మంచిది. త్వరగా ఆస్పత్రికి చేర్చగలిగితే వారి ప్రాణాలు కాపాడడానికి అవకాశం ఉంటుంది. సకాలంలో ఆస్పత్రికి చేర్చలేకపోతే పరిస్థితి విషమించే అవకాశం ఉంటుంది. ఒక్కో సమయంలో ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంది.



108 అంబులెన్సు


108 అంబులెన్సులో రోగిని తరలిస్తున్న సిబ్బంది

విశాఖ వెళ్లి వచ్చేందుకు నాలుగు గంటల సమయం

108 అంబులెన్సు జిల్లా కేంద్రం నుంచిగాని ఇతర మండలం నుంచి విశాఖపట్నం రోగులను కేజీహెచ్ తరలించడానికి నాలుగు నుంచి నాలుగున్నర గంటల సమయం పడుతుంది. బొబ్బిలి వంటి ప్రాంతాల నుంచి ఐదు నుంచి గంటల వరకు సమయం పడుతుంది. జిల్లాలో ఉన్న సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నుంచి కేజీహెచ్‌కు రోగులను తరలిస్తారు. అదేవిధంగా సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల నుంచి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి 108 అంబులెన్సులు ద్వారా రోగులను తరలిస్తారు. 108 అంబులెన్సులు కేసులను తరలించే సమయంలో ఆ మండలంలో అత్యవసర కేసులు వస్తే పక్క మండలం నుంచి అంబులెన్సు రావడానికి సమయం పడుతుంది.

108 అంబులెన్సులు ఇలా..

జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 27 మండలాలకు 108 అంబులెన్సులు 27 ఉన్నాయి. నవజాతి శిశువుల కోసం జిల్లా అంతటకి ఒకే నియోనేటల్ అంబులెన్సు ఉంది. విజయనగరం నియోజకవర్గం మొత్తానికి ఒకటే అంబులెన్సు ఉంది. విజయనగరం పట్టణంలో మూడు లక్షల వరకు జనాభా ఉంది. మండలంలో 40 వేల నుంచి 50 వేల మంది వరకు ఉంటారు. వీటితో పాటు ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. వీటిన్నటికి ఒకే అంబులెన్సు ఉంది. ఆ ఒక్క అంబులెన్సు ఐఎఫ్‌టీ(ఇంటర్ స్పెషలిటి ట్రాన్స్‌పోర్ట్) కేసులకు వెళితే అత్యవసర కేసులకు పక్క మండలం నుంచి 108 రావాల్సి వస్తుంది. పా అంబులెన్సు జిల్లా కేంద్రానికి వస్తే అక్కడ ఏదైనా అత్యవసర కేసు వస్తే అక్కడ రోగులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. 108 అంబులెన్సు వచ్చే వరకు ఉండలేని పరిస్థితి. దీంతో ప్రైవేటు అంబులెన్సులను రోగులు ఆశ్రయిస్తున్నారు.

పక్క మండలాల నుంచి..

108 అంబులెన్సులు ఐఎఫ్‌టీ కేసులకు వెళ్లినప్పుడు పక్క మండలం నుంచి అంబులెన్సులను పంపించి రోగులను ఆస్పత్రికి తరలిస్తున్నాం. రోగులకు ఇబ్బంది లేకుండా సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– నజీర్ హుస్సేన్, 108 జోనల్ మేనేజర్

క్లుప్తంగా

24, 25 తేదీల్లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

– జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ వీఎస్ ప్రసాద్

విజయనగరం: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వివిఎస్.ప్రసాద్ తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 24న అండర్ – 13, 15, 17 వయస్సుల విభాగంలో బాల, బాలికలకు సింగిల్స్ విభాగంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 25న పురుషులకు డబుల్స్ విభాగంలో వెటరల్ పోటీలు నిర్వహించటం జరుగుతుందని పేర్కొన్నారు. పోటీల్లో సింగిల్స్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు రూ.300, డబుల్స్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు రూ.600 ప్రవేశ రుసుం కింద చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 22వ తేదీలోగా తమ పేర్లను విజయనగరం, ఎస్.కోట, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం, కొత్తవలస, చీపురుపల్లి ప్రాంతాల్లో కోచ్‌ల వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

తల్లీపిల్లల అదృశ్యంపై కేసు

సీతంపేట: సీతంపేటకు చెందిన తల్లీపిల్లలు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వై.అమ్మన్నరావు శనివారం తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ట్రాక్టర్ మోటార్ సైకిల్ ఢీకొని వ్యక్తికి గాయాలు


ప్రమాదానికి గురైన ట్రాక్టర్, మోటార్ సైకిల్

తెర్లాం: ఎదురెదురుగా వస్తున్న ట్రాక్టర్ మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వెలగవలస గ్రామానికి సమీపంలో జరిగింది. దీనికి సంబంధించి తెర్లాం ఎస్‌ఐ సాగర్‌బాబు శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి 9గంటల ప్రాంతంలో రాజాం నుంచి వస్తున్న మోటార్ సైకిల్‌ను తెర్లాం వైపు నుంచి రాజాం వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ నడుపుతున్న మెరకముడిదాం మండలం ఎం.గదబవలసకు చెందిన ఆరంగి పోలినాయుడుకి కాలు విరిగిపోవడంతో పాటు, తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాజాం కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి విశాఖపట్నం ఆస్పత్రికి మెరుగైన వైద్య సేవల నిమిత్తం తరలించారు. విశాఖపట్నం ఆస్పత్రి వైద్యులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లి సమాచారాన్ని సేకరించామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాగర్‌బాబు తెలిపారు.

మాంగనీసు గనిలో పడి వ్యక్తి మృతి


మాంగనీసు గనిలో పడి మృతి చెందిన రాములు

చీపురుపల్లి: మండలంలోని పేరిపి, చినకడిపల్లి గ్రామాల మధ్య ఉన్న మాంగనీసు గనిలో పడి కొంగరాపు రాములు(65) మృతి చెందాడు. ఐదారు రోజులు క్రితమే రాములు గనిలో పడి మృతి చెందినప్పటికీ శనివారం వరకు తెలియలేదు. శనివారం పొలాలకు వెళ్లిన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ ఎల్.దామోదరరావు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీసి పంచనామా నిర్వహించారు. గరివిడి మండలంలోని శివరాం గ్రామానికి చెందిన కొంగరాపు రాములు జనవరి 2 నుంచి మతిస్థిమితం కోల్పోయి గ్రామం నుంచి వచ్చేసాడు. మాంగనీసు గని వైపు నుంచి వెళ్తూ జారిపడి మృతి చెందాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దామోదరరావు తెలిపారు.

కానరాని రక్షణ చర్యలు

ఇదిలా ఉండగా పేరిపి, చినకడిపల్లి గ్రామాల మధ్య నాలుగైదు అతిభారీ మాంగనీసు గనులు ఉన్నాయి. ఈ రెండు గ్రామాలకు చెందిన రైతులు తమ పంట పొలాలు సైతం అటువైపే ఉండడంతో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మాంగనీసు గని వద్ద కనీసం ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా ఉండడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆ గనిలో మాంగనీసు తవ్వకాలు నిలిపివేయడంతో ఫెన్సింగ్ వేయాలని గ్రామస్తులు యాజమాన్యాన్ని కోరినప్పటికీ పట్టించుకోలేదని రెండు గ్రామాల ప్రజలు పోలీసులకు చెప్పారు.

శని త్రయోదశి పూజలు

బొండపల్లి: శని త్రయోదశి నేపథ్యంలో దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనీశ్వరుడికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పుట్టిన నక్షత్రాల ప్రకారం తైలాభిషేకాలు చేశారు.

కూరగాయల బజార్‌ను ప్రారంభించిన మంత్రి


మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం : మండల కేంద్రంలోని నాబార్డ్ సహాయంతో నూతనంగా ఏర్పాటు చేసిన కూరగాయల బజార్‌ను బెస్ట్ మోడల్ బజార్‌గా తీసుకురావాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గజపతినగరంలో కూరగాయల బజార్‌ను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. రానున్న రోజుల్లో గజపతినగరం కూరగాయల మార్కెట్‌తో పాటు గజపతినగరంలో పలు ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా ప్రయత్నం చేస్తానని మంత్రి అన్నారు. షెడ్లు లీజుకు ఇవ్వకుండా ఎవరైతే సక్రమంగా నడుపుతారో వారికే కేటాయించాలన్నారు. త్వరలో చెత్త ద్వారా సంపద తయారు చేసేందుకు ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, సర్పంచ్ నరవ కొండమ్మ, నాబార్డ్ అధికార బృందం, తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితునికి రిమాండ్

వీరఘట్టం: మండలంలోని ఎస్.నర్సిపురం గ్రామానికి చెందిన చింత రామకృష్ణను పిడిగుద్దులు గుద్ది హత్య చేసిన ఇదే గ్రామానికి చెందిన బందలుప్పి కిరణ్‌కు పాలకొండ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ విజయ్‌రాజ్ 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి తెలిపారు. ఈ మేరకు జైలుకు తరలించినట్టు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడులు

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్లలో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్‌ఐ జి.కళాధర్ తన పోలీసు సిబ్బందితో శనివారం దాడులు చేసారు. పోలీసు వస్తున్నట్లు సమాచారం తెలియడంతో చాలా మంది పరారవ్వగా తొమ్మిది మంది పట్టుబడినట్లు ఎస్‌ఐ తెలిపారు. వీరి నుంచి రూ.7,920లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

విజయనగరం క్రైమ్: గంజాయి కోసం చేపట్టిన సోదాల్లో చేతివాటం ప్రదర్శించిన నెల్లిమర్ల పోలీస్ కానిస్టేబుల్ ఎస్.కృష్ణ కిశోర్‌ను సస్పెండ్ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు మూడు నెలల క్రితం నెల్లిమర్ల పోలీసులకు వచ్చిన కచ్చితమైన సమాచారం మేరకు నెల్లిమర్ల ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది ఒక విద్యార్థి గదిలో నిర్వహించిన సోదాల్లో కానిస్టేబుల్ ఎస్.కృష్ణకిశోర్ చేతివాటం ప్రదర్శించినట్లు పోలీసు అధికారులు చేపట్టిన విచారణలో వెల్లడి కావడంతో అతన్ని విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో పోలీసు ఉద్యోగులు నిష్పక్షపాతంగా, క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


కొత్తబొడ్డాంలో పట్టుబడిన బియ్యం వ్యాన్

వేపాడ: మండలంలో కొత్తబొడ్డాం జంక్షన్ వద్ద శనివారం రాత్రి పీడీఎస్ బియ్యం పట్టుబడినట్లు సీఎస్‌డీటీ రామకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించి సీఎస్‌డీటీ అందించిన వివరాలు ఇలా వున్నాయి. విజిలెన్స్ సీఐ బి.సింహాచలం అందిన సమాచారం మేరకు విజిలెన్స్ సీఐతో పాటు సీఎస్‌డీటీ దాడులు నిర్వహించారు. కొత్త బొడ్డాం నుంచి తరలించేందుకు టాటా ఏసీలో సిద్ధంగా వున్న 1189 కేజీలు పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన బియ్యాన్ని బొడ్డాం-2 డీలరుకు అప్పగించి వ్యాన్‌ను, పట్టుబడిన వ్యక్తిని వల్లంపూడి పోలీసుస్టేషన్‌కు అప్పగించి 6ఏ కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ తెలిపారు.

వైభవంగా కూడారై ఉత్సవం


108 కళశాల్లో స్వామివారికి కూడారై పాయసాన్ని నివేదిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి సన్నిధిలో కూడారై ఉత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా భోగికి ముందు కూడారై ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు శనివారం వేకువజామున గోదాదేవి అమ్మవారికి పల్లకీ సేవను అర్చకులు నిర్వహించారు. అనంతరం స్వామి సన్నిధిలో తిరుప్పావై గ్రంథంలోని 27వ పాశురాన్ని ఆలయ అధ్యాపకులు అనుసంధానం చేశారు. కూడారై పాయశాన్ని ప్రత్యేకంగా తయారు చేసి 108 కలశాల్లో స్వామికి నివేదించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, మల్లిఖార్జున శర్మ, వర ప్రసాద్, కిరణ్‌కుమారాచార్యులు, రామగోపాల్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనానికి వెళ్లి.. మృత్యు ఒడిలోకి..


గొడ్డు శంకరరావు (ఫైల్)

విజయనగరం క్రైమ్: దొంగతనం చేయడానికి వెళ్లి... మృత్యుఒడిలోకి వెళ్లిపోయిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. దీనికి సంబంధించి టూటౌన్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక దాసన్నపేట సమీపంలో నిర్మాణమవుతున్న నాలుగంతస్తుల భవనంలోకి అశోక్ నగర్‌కి చెందిన గొడ్డు శంకరరావు (24) మంగళగిరి సాయి అనే వ్యక్తితో పాటూ మరికొందరు వ్యక్తులతో కలిసి విద్యుత్ వైర్లు దొంగతనం చేయడానికి వెళ్లారు. ఐదో అంతస్తులో ఉన్న రెండు గదుల్లో కరెంటు వైర్లు కత్తిరించి ఆ పక్కనే ఉన్న లిఫ్ట్ కోసం ఉన్న ఖాళీ ప్రదేశంలో శంకరరావు ప్రమాదవశాత్తూ కాలు జారి ఐదో అంతస్తు నుంచి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని రెండు కాళ్లు విరిగిపోయి, తలకు తీవ్ర గాయమై సంఘటనా స్థలంలోని మృతి చెందాడు. మృతుడు శంకరరావు భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రబీకి సాగునీరు విడుదల చేయండి

- అధికారులను కోరిన తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్ విజయరమణి
- నీటి విడుదల తమ పరిధిలో లేదని తేల్చి చెప్పిన డీఈఈ గన్నిరాజు


వీరఘట్టంలో జలవనరుల శాఖ అధికారులతో సమావేశమైన తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు

వీరఘట్టం: తోటపల్లి పాత ఆయకట్టు ఆధునీకీకరణ పనులు ఆగినందున కనీసం ఈ రబీలోనైనా పాత ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాలని ప్రాజెక్టు చైర్మన్ పాదిలాపు విజయరమణి కోరారు. వీరఘట్టంలో జలవనరుల శాఖ అధికారులతో ఇటీవల నూతనంగా ఎంపికైన 25 మంది నీటి సంఘాల అధ్యక్షులు, టీసీలతో కలసి శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాల్వ పనులు చేస్తున్నామని గత రబీలో నీటి విడుదల ఆపేసారు కదా, ప్రస్తుతం కాల్వ పనులు జరగనందున నీటి విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా జల వనరుల శాఖ డిఈఈ వై.గన్నిరాజు మాట్లాడుతూ తోటపల్లి పాత ఆయకట్టు పరిధిలో ఉన్న కుడి, ఎడమ కాలువల్లో ఆధునీకరణ పనులు 25 శాతం దాటనందున ఈ పనులను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ప్రాజెక్టుల్లో గరిష్ట నీటి మట్టం 105 మీటర్లు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 104.15 మీటర్లు ఉందన్నారు. ప్రాజెక్టు వద్ద ఇన్‌ఫ్లో 170 క్యూసెక్కులు వస్తుండగా, నదిలోకి 460 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నట్లు తెలిపారు. కొత్త కుడి కాలువ ద్వారా విజయనగరం జిల్లా వాసుల తాగునీటి అవసరాల కోసం వారం రోజులకొకసారి సుమారు 400 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో పాత ఆయకట్టు కాలువలకు నీటి విడుదల చేయడం కుదరదన్నారు. సాగునీటి విడుదల అంశం తమ పరిధిలో లేదన్నారు.

కలెక్టర్ వద్దే తేల్చుకుంటాం..

తోటపల్లి సాగునీటి విడుదల తమ పరిధిలో లేదని డీఈఈ చెప్పడంతో కొత్తగా ఎంపికైన నీటి సంఘాల అధ్యక్షులు అసంతృప్తి వ్యక్తం చేసారు. మా ప్రాంత రైతులు మమ్మల్ని సాగునీటి కోసం నిలదీస్తున్నారని, మిమ్మల్ని ఎందుకు ఎన్నుకున్నామని ప్రశ్నిస్తున్నారని, ఈ పరిస్థితుల్లో పాత ఆయకట్టుకు నీటి విడుదల చేయకపోతే రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని తమ అభిప్రాయాలను నీటి సంఘాల అధ్యక్షులు వ్యక్తం చేసారు. ఈ విషయాన్ని కలెక్టర్ వద్దే తేల్చుకుంటామని సమావేశం నుంచి అందరూ వెళ్లిపోయారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆలుబిల్లి పార్థసారధి, డీసీలు మాచర్ల నందీశ్వరరావు, పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం జిల్లాల్లో తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్న నీటి సంఘాల అధ్యక్షులు, టీసీలు, ఏఈ డి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ అవస్థలు

రామభద్రపురం: మండల కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. నాలుగు రాష్ట్రాల కూడలి కావడంతో పాటు సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రాకపోకలు అధికంగా ఉండడం వల్ల ఈ సమస్య ఇప్పుడు జటిలమైందని స్థానికులు అంటున్నారు. ప్రతిరోజూ గంటల కొద్దీ వాహనాలు రోడ్లపైనే నిలిచిపోతున్నాయని, దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్డు ఆక్రమణలు తొలగించి, రోడ్డును విస్తరించాలని అలా చేస్తే కానీ ట్రాఫిక్ అవస్థలు ఉండవన్నారు.

ధ్యానం, యోగాతో ఆరోగ్యం


విద్యార్థులతో ధ్యానం చేయిస్తున్న కోటేశ్వరరావు

శృంగవరపుకోట: నిత్యం ధ్యానం, యోగాసాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని స్థానిక మోక్షవిద్య యోగమందిర్ కార్యదర్శి శీల కోటేశ్వరరావు అన్నారు. స్వామి వివేకానంద జయంతి వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బర్మా కాలనీలో విద్యార్థులకు శనివారం స్వామి వివేకానంద జీవిత చరిత్ర ను వివరించారు. వివేకానంద జీవిత విశేషాలకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, వారితో ధ్యానం చేయించారు. మోక్ష విద్య యోగమందిర్ సభ్యులు మాడెం పార్వతి, కర్రి లలిత, వార్డు మెంబర్ పి.సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, ఎన్‌జీఓ సంఘ సభ్యులు

లక్కవరపుకోట: ఏపీ ఎన్‌జీఓ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మండల కేంద్రంలోని తన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. ఎన్‌జీఓల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీ ఎన్‌జీఓ కొత్తవలస తాలూక అధ్యక్షుడు జె.వి.ప్రసాదరావు, సంఘ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. సంఘం జనరల్ సెక్రటరీ డి.శ్రీనివాస్ అసోసియేట్ ప్రెసిడెంట్ రామలక్ష్మణ్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వరులు, జాయింట్ కార్యదర్శి భాగ్యలక్ష్మి, సభ్యులు వెంకటరమణ, సత్యారావు, శంకరరావు, ప్రశాంతి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తూ పట్టుబడిన యువకులు


పోలీసులకు పట్టుబడిన గంజాయి సేవిస్తున్న వ్యక్తులు

రాజాం సిటీ: పట్టణ సమీపంలోని రేగిడి మండలం పరిధి బాలకవివలస రోడ్డులో గంజాయి సేవిస్తూ నలుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ హెచ్.ఉపేంద్ర శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. బాలకవివలస లే అవుట్ ముళ్లపొదల వద్ద నలుగురు వ్యక్తులు గంజాయి సేవిస్తూ పోలీసులకు చిక్కారన్నారు. ఈ వ్యక్తులు వాటర్ బాటిల్ సహాయంతో గంజాయి కాలుస్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు. వీరికి పాలకొండకు చెందిన బొద్దాన దుర్గాప్రసాద్ గంజాయి విక్రయించినట్లు వారు తెలిపారని సీఐ అన్నారు. దీంతో గంజాయి సేవించిన వారితో పాటు విక్రయించిన వ్యక్తిని రేగిడి ఎస్‌ఐ పి.నీలావతి తన సిబ్బందితో పట్టుకుని అరెస్టు చేశారని తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న దుర్గాప్రసాద్ వద్ద జీఎంఆర్ ఐటీ తోటలో 1.5 కేజీల గంజాయిని సంతకవిటి ఎస్‌ఐ ఆర్.గోపాలరావు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారని చెప్పారు.

గంజాయితో పట్టుబడిన యువకుడు


గంజాయిని సీజ్ చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు(వెనుక ముసుగులో నిందితుడు)

కొత్తవలస: ఆర్‌టీసీ బస్సులో అక్రమంగా గంజాయిని రవాణ చేస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాకేష్‌కుమార్‌ను కొత్తవలస పోలీస్‌లు శనివారం అరెస్టు చేసారు. దీనికి సంబంధించి సీఐ షణ్ముఖరావు తెలిపిన వి వరాలు... రాకేష్‌కుమార్ ఆ ర్‌టీసీ బస్సులో గంజాయిని తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం రావడంతో ఎస్‌ఐ సుదర్శన్ రావు ఆధ్వర్యంలో పోలీస్‌లు కొత్తవలస ఆర్‌టీసీ కాంప్లెక్ వద్ద మాటు కాసారు. అరకు నుంచి వచ్చిన ప్రతీ బస్సును తనిఖీ చేసారు. ఇందులో భాగంగా 4 కేజీల గంజాయిని రాకేష్‌కుమార్‌ను గుర్తించారు. నిందితుడు రాకేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ నీలకంఠరావు సమక్షంలో గంజాయిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని కొత్తవలస కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

గంజాయి సీజ్

గజపతినగరం : గజపతినగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రైల్వే స్టేషన్ సమీపంలో బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద గంజాయిని సరఫరా చేస్తూ పలువురితో సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. స్థానిక సమాచారం మేరకు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు సిబ్బందితో కలిసి రైల్వేట్రాక్ వద్దకు వెళ్లగా కొంతమంది వ్యక్తులు పరుగులు తీయగా ఎస్‌ఐ ఆరా తీయడంతో బొండపల్లికి చెందిన గున్నేని నవీన్ కుమార్ (ఒడిశాకు చెందిన వ్యక్తి ఇక్కడ స్థిరపడ్డాడు) నుంచి 400గ్రాములు గంజాయి, మరో మైనర్ నుంచి 300గ్రాములు గంజాయి, మూడు సెల్ ఫోన్‌లు పట్టుపడడంతో వారిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇందులో మరో ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థులను కూడా బాధితులుగా గుర్తించి వారికి కౌన్సెలింగ్ చేసి తల్లిదండ్రులకు అప్పగించినట్లు చెప్పారు. గంజాయిని సరఫరా చేస్తూ సేవించిన నవీన్‌కుమార్‌తో పాటు మరో మైనర్ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ చెప్పారు. సీఐ జిఎవి.రమణ, ఎస్‌ఐ కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

పాడిపశువుల సంరక్షణకు ప్రాధాన్యం


గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం: ప్రభుత్వం పాడి పశువుల సంరక్షణకు, పాడి పరిశ్రమాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. మండలంలోని మరిపివలసలో ఎన్ఆర్‌జీఎస్ నిధులతో పాడి రైతులు నిర్మించిన గోశాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పాడిపశువుల సంరక్షణకు గోశాలలు నిర్మాణం అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ నేపథ్యంలో మొదటి విడతగా మంజూరు చేసిన 24 గోశాలలకు గాను 23 మంది లబ్ధిదారులు నిర్మాణం చేసేందుకు ముందుకు రావడంతో నిర్మాణాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయన్నారు. ఎంపీడీఓ త్రివిక్రమరావు, మండల పశువైద్యాధికారి డాక్టర్ రామారావు, సర్పంచ్ సాంబందొర, ఉపాధి హామీ పథకం ఏపీఓ భాను, ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ, పంచాయతీ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.